క్లుప్తంగా

హాకీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తగూడెంఅర్బన్: సన్ రైజెస్ చారిటీ క్లబ్ ఆధ్వర్యంలో జీయర్ స్పోర్ట్స్ ఫెస్టివల్ 2023–24 ఆటల పోటీల్లో ఎస్ఆర్ డీజీ రాంనగర్ పాఠశాల విద్యార్థులు హాకీ పోటీల్లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన విజేతల అభినందన సభలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జ్ వై.సతీష్ మాట్లాడుతూ.. సాయిశ్రీచరణ్ టీం చిన్నజీయర్ స్వామి శిష్యుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని వివరించారు. అనంతరం సాయిశ్రీచరణ్‌కు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.తిరుమలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థిని గెలిపిద్దాం..

చుంచుపల్లి: కొత్తగూడెం నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లక్కినేని సురేందర్‌రావు విజయానికి కలిసికట్టుగా పని చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ అన్నారు. శనివారం విద్యానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన బీజేపీ – జనసేన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పొత్తులో భాగంగా కొత్తగూడెం స్థానాన్ని జనసేనకు కేటాయించినట్లు చెప్పారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు సురేందర్‌రావు గెలుపే లక్ష్యంగా ప్రతీఒక్కరు పని చేయాలని సూచించారు. సమావేశంలో లక్కినేని సురేందర్‌రావు, శ్రీనివాస్, వేముల కార్తీక్, గోగుల రవీందర్, యడ్లపల్లి శ్రీనివాసరావు, పైడిపల్లి రవీందర్, రాయుడు నాగేశ్వరరావు, రాజేష్ పాల్గొన్నారు.

మోకాళ్లపై తిరుమలకు..


మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న రాంసింగ్

జూలూరుపాడు: కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్, పాలేరు ఎమ్మెల్యే అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గెలవాలని ఆయన అభిమాని మోకాళ్లపై తిరుమతి నుంచి తిరుమల వెళ్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నాడు. జూలూరుపాడు మండలం కరివారిగూడెం కాలనీకి చెందిన బర్మావత్ రాంసింగ్ తాజాగా 200 మెట్లను మోకాళ్లపై ఎక్కాడు. కాగా, శ్రీనివాసరెడ్డి గెలిచాక మళ్లీ తిరుమల వెళ్లనున్నట్లు రాంసింగ్ తెలిపాడు.

మా పయనం బీఆర్ఎస్‌తోనే..


మాట్లాడుతున్న మడత వెంకటగౌడ్

ఇల్లెందు: అభిమానులు, మాజీ ప్రతినిధులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకటగౌడ్ స్పష్టం చేశారు. శనివారం ఇల్లెందులోని ఏక్తా భవన్ వద్ద జరిగిన మడత అభిమానుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రజాభీష్టం మేరకే తమ పయనం సాగుతోందని తెలిపారు. కొంతకాలంగా అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు ప్రచారం సాగిందన్నారు. దసరా ఉత్సవాల కోసం మంత్రి కేటీఆర్‌ను కలిసి గ్రౌండ్ విషయం చర్చించినప్పుడు కండువా వేశారని, అంత మాత్రనా తాను ఒక్కడినే పార్టీలో చేరినట్లు ప్రచారం సాగిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఊగిసలాటలకు చరమగీతం పలికేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ చైర్మన్ మడత రమ, మాజీ కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

స్కూల్‌లో కౌన్సిల్ ఎన్నికలు


ఓట్లను లెక్కిస్తున్న ఉపాధ్యాయులు

పాల్వంచ: అసెంబ్లీ ఎన్నికల తరహాలో టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సమక్షంలో స్కూల్ కెప్టెన్ పదవికి ఇద్దరు, వైస్ కెప్టెన్‌కి ముగ్గురు విద్యార్థులు పోటీ పడగా, వారికి ఎన్నికల గుర్తులు కేటాయించారు. అనంతరం సంబంధిత గుర్తులతో అభ్యర్థులు ప్రచారం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల్లో విద్యార్థులు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేశారు. అనంతరం ఓట్లను లెక్కించారు. కెప్టెన్‌గా కె.సాత్విక్ 235 మెజార్టీతో, వైస్ కెప్టెన్‌గా కె.సంకేత్ 103 మెజార్టీ, స్పోర్ట్ కెప్టెన్‌గా ఎం.సుశాంత్ 365 మెజార్టీతో గెలిచారు. 68 ఓట్లు నోటాకి పడినట్లు ఎన్నికల అధికారులు సీహెచ్.అరుణ్‌కుమార్, సుమన్, సుదీప్ తెలిపారు.

వరుస పండుగలతో సందడి

నేడు దీపావళి పర్వదినం

- 14 నుంచి కార్తీకమాసం
- టపాసులు, పూజా సామగ్రి, అమ్మకాలు, కొనుగోళ్లతో మార్కెట్లు కళకళ


కొత్తగూడెంటౌన్: సూపర్‌బజార్‌లో వినియోగదారులతో రద్దీ

కొత్తగూడెంటౌన్: ఆదివారం దీపావళి పర్వదినం. 14వ తేదీ నుంచి కార్తీకమాసం మొదలు కానుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా పండుగ సందడి నెలకొంది. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. దీపావళి అంటేనే దీపోత్సవం.. దీపావళి పండుగ రోజున ప్రతి ఇల్లు, వీధులు, దేవాలయాలు అన్నిచోట్ల దీపాల వెలుగులతో కళకళలాడుతుంటాయి. టపాసుల అమ్మకాలు, కొనుగోళ్లు, పూలు, స్వీట్లు, బంగారం, నూతన వస్త్రాల కొనుగోళ్లకు ప్రజలు జిల్లా కేంద్రం కొత్తగూడెం తరలిరావడంతో మార్కెట్లన్నీ సందడిగా మారాయి.

బొమ్మలు, ప్రమిదల అమ్మకం..

కొత్తగూడెం సూపర్‌బజార్, రామవరం, రుద్రంపూర్, పాలకేంద్రం, రైతుబజార్, విద్యానగర్ కాలనీలలో బొమ్మల కొలువుకు అవసరమైన లక్ష్మీదేవి అమ్మవారి దేవతామూర్తుల విగ్రహాలను, దీపాంతలను అమ్మకాలతో మార్కెట్లన్నీ కిటకిటలాడుతున్నాయి. దీపాంతలు సైజును బట్టి డజన్ రూ.40 – 70, బొమ్మలు రూ.50 – 250 వరకు అమ్ముతున్నారు. ప్రత్యేకంగా దేవుడి బొమ్మతో ఐదు దీపాంతలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. కొనుగోలు చేసేందుకు ప్రజలు మార్కెట్లకు తరలిరావడంతో మార్కెట్లన్నీ కిటకిటలాడుతున్నాయి.

టపాసుల అమ్మకాలు..

దీపావళి పండుగ సందర్భంగా కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సూపర్‌బజార్, సింగరేణి ప్రకాశం స్టేడియం, బస్టాండ్ సెంటర్, రామవరం పోస్టాఫీస్ సెంటర్, రుద్రంపూర్, విద్యానగర్‌కాలనీ, పాత కొత్తగూడెం, రామవరం మెయిన్‌బజార్‌లతో టపాసుల అమ్మకాలకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేశారు.

టేకులపల్లి: దీపావళి సందడి మొదలైంది. మండల కేంద్రంలోని సంత స్థలంలో టపాసుల అమ్మకాలకు మూడు దుకాణాలు ఏర్పాటు చేశారు. శనివారం వారాంతపు సంత కూడా కావడంతో మండలంలోని దూరప్రాంతాలకు చెందిన ప్రజలు నిత్యావసర వస్తువులతో పాటు దీపావళి టపాసులు కూడా కొనుగోలు చేశారు. వీటిలో పాటు ప్రమిదల విక్రయాలు కూడా జోరుగా సాగాయి.

ఇల్లెందు: దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడలి ఆంబజార్‌లో శనివారం రద్దీ నెలకొంది. కిరాణం, బట్టలు, జనరల్ స్టోర్లు కిటకిటలాడాయి. సీఈఆర్ గ్రౌండ్‌లో 30 టపాసుల దుకాణాలు షాపులు ఏర్పాటు చేశారు.

సండే స్పెషల్


ఇల్లెందులో ప్రమిదల దుకాణాలు


టేకులపల్లిలో కొనుగోళ్ల సందడి

ప్రతీ దీపావళికి ఇక్కడికొస్తాం..



మాది ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురం. ప్రతి దీపావళి పండుగకు వారం ముందు ఇక్కడికి వచ్చి దీపాంతలు, ఒత్తులు అమ్ముతాం. ఇక్కడ గిరాకీ బాగుంటుంది. మాకు రోజుకు ఖర్చులు పోను రూ.800 – 1200 వరకు మిగులుతున్నాయి. దీపావళి, కార్తీక మాసం అంతా గిరాకీ ఉంటుంది.

– బాలయ్య, బొమ్మల వ్యాపారి అమలాపురం

అమ్మకాలు బాగున్నాయి..



పండుగలకు కొత్తగూడెంకు వచ్చి వ్యాపారం చేస్తుంటాం. దీపాంతలు, బొమ్మలు, ప్లాస్టిక్ పూలతో పాటు వివిధ రకాల వస్తువులను తక్కువ ధరకు అమ్ముతున్నాం. గిరాకీ బాగుంది. రోజుకు ఇప్పటి వరకు అన్ని ఖర్చులు పోను రూ.500 మిగులుతున్నాయి. పండుగ ముందు రోజు అమ్మకాలు బాగున్నాయి.

– ప్రసాద్ బొమ్మల వ్యాపారి, అనకాపల్లి

బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తా..



ఆదివారం దీపావళి పండుగ కావడంతో దీపాంతలు, బొమ్మలు కొనడానికి సూపర్‌బజార్‌కు వచ్చాం. పండుగను మా కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి సంతోషంగా జరుపుకుందామని ప్లాన్ చేసుకున్నాం. నాకు నచ్చిన దీపాంతలు, బొమ్మలు కొలువుకు కావలసినవి కొనుగోలు చేశా.

– మాలోతు సరస్వతి, గృహిణి, కొత్తగూడెం

కాంగ్రెస్ పార్టీని గెలిపించండి..


మాట్లాడుతున్న కోరం కనకయ్య

టేకులపల్లి: కాంగ్రెస్ పార్టీ ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య టేకులపల్లి మండలంలో ప్రచారం ప్రారంభించారు. ఈ మేరకు శనివారం సంపత్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సతీసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగారం, సంపత్‌నగర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు సంక్షేమ పథకాలు మహాలక్ష్మి, యువ వికాసం, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ, రైతు భరోసా గురించి ప్రజలకు వివరించారు. హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న స్పందనతో ఎన్నికల్లో గెలుపుపై స్పష్టత వచ్చిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. లచ్చగూడెం పంచాయతీ లచ్చగూడెం, కొమ్ముగూడెం గ్రామాలలో శనివారం రాత్రి కోరం కనకయ్య సమక్షంలో పలు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జానీ, ముక్తి కృష్ణ, మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఇల్లెందు: త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్యను గెలిపించేందుకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు నాయకులు, కార్యకర్తలను కోరారు. శనివారం తన ఇంటి వద్ద పట్టణ కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో జరిగింది. డీవీ మాట్లాడుతూ.. ఎన్నికలకు 15 రోజులే గడువు ఉందని, గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ పథకాలను, అధికార పార్టీ అక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి వస్తే ఆడబిడ్డలకు రూ.500కు వంట గ్యాస్ సిలిండర్, నిరుపేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తుందని తెలిపారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల ముంగిటలకు చేర్చాలని ప్రజల ఆశీర్వాదం పొందాలన్నారు. కార్యక్రమంలో డి.డానియేల్, యదళ్లపల్లి అనసూర్య, ఎస్‌కే జానీ, కౌన్సిలర్లు పత్తి స్వప్న, వారా రవి, మొగిలి లక్ష్మి, నవీన్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి

పాల్వంచ: పారిశ్రామిక ప్రాంతాలైన కొత్తగూడెం, పాల్వంచలో ఉపాధి అవకాశాలు స్థానికులకే ఇచ్చేలా కృషి చేస్తానని బీఎస్పీ అభ్యర్థి యెర్రా కామేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని వెంగళరావు కాలనీ, కేటీపీఎస్ కాలనీల్లో కామేశ్ విస్తృత ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. బొగ్గు, విద్యుత్ ఆధారిత సంస్థలను నెలకొల్పడం ద్వారా స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల హామీలను తుంగలో తొక్కి అవినీతి పాలన చేసిందని విమర్శించారు.

కాంగ్రెస్‌లో చేరిక

జూలూరుపాడు: భేతాళపాడు గ్రామ పంచాయతీ రాచబండ్ల కోయగూడెంకు చెందిన 30 కుటుంబాలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి సమక్షంలో పలు పార్టీలకు చెందిన కుటుంబాల వారు కాంగ్రెస్‌లో చేరారు. వీరందరికీ ఆయన పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. మాలోత్ మంగీలాల్ నాయక్, నున్నా రంగారావు, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు, నర్వనేని పుల్లారావు పాల్గొన్నారు.

స్టాండింగ్ ఆర్డర్స్ అమలు చేయాలి

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు స్టాండింగ్ ఆర్డర్స్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, ఇందుకు విద్యుత్ సంస్థల యాజమాన్యంతో మీటింగ్ చేయాలని లేబర్ కమిషనర్‌కు లేఖ రాసినట్లు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1535) సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ వజీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టాండింగ్ ఆర్డర్స్ విధి విధానాల్లో ఐదు సంవత్సరాల సర్వీస్ చేసిన వారికి అప్‌గ్రేడేషన్ చేయాల్సి ఉందన్నారు. 20వేల మంది కార్మికులకు గ్రేడ్‌లు మార్చి హయ్యర్ గ్రేడ్ అమలు చేసి న్యాయం చేయాలని కోరామని తెలిపారు.

ఎమ్మెల్యేపై ఎంపీపీ, ఎంపీటీసీల అలక


ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ. ఎంపీటీసీలు

టేకులపల్లి: మండలంలోని అధికార పార్టీ బీఆర్ఎస్ ఎంపీపీ, ఎంపీటీసీలు.. ఎమ్మెల్యే హరిప్రియపై అసంతృప్తి గళం వినిపిస్తున్నారు. మండలంలో మొత్తం 14మంది ఎంపీటీసీలు ఉండగా ఎనిమిది మంది శనివారం మండల కేంద్రంలోని సేవాలాల్ ఆలయంలో సమావేశమయ్యారు. తమకు జరిగిన అన్యాయంపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గెలిచిన నాటి నుంచి ఎమ్మెల్యే వెంటే ఉన్నామని, పార్టీకి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నామని పేర్కొన్నారు. అయినా గౌరవం లేదని దక్కలేదన్నారు. రూ.కోట్లతో అభివృద్ధి పనులు జరిగినా తమకు ప్రాధాన్యం ఇవ్వలేదని, ప్రోటోకాల్ పాటించలేదని, అధికార కార్యక్రమాలకు పిలవలేదని వాపోయారు. మరోసారి సమావేశమై తదుపరి నిర్ణయం ప్రకటిస్తామన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చిన ఐక్యమత్యంగా ముందుకెళ్దామని ప్రతిజ్ఞ చేశారు.

టీఆర్ఎస్ యూత్‌లో అంతర్మథనం


సమావేశమైన యువకులు

ఇల్లెందు: ఎన్నికలు సమీపిస్తుండడంతో నియోజకవర్గంలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. నిన్నటి వరకు టీఆర్ఎస్ యూత్‌లో కొనసాగిన యువత అంతర్మథనంలో పడింది. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకే సముచిత స్థానం దక్కలేదని, తమకెవరు దిక్కు అంటూ పార్టీ మార్పుపై సమాలోచనలు చేస్తున్నారు. శనివారం కాకతీయ నగర్‌లో యూత్ లీడర్ సతీష్ ఇంటి వద్ద పట్టణ అధ్యక్షుడు మెరుగు కార్తీక్ యాదవ్ ఆధ్వర్యంలో 24 వార్డులకు చెందిన యువకులు సమావేశమయ్యారు. మెజార్టీ సభ్యులు పార్టీ మారాలని మైనార్టీ సభ్యులు ఆచితూచి అడుగులు వేయాలని ఓ నిర్ణయానికి వచ్చారు. అటు చైర్మన్‌తో ఇటు ఎమ్మెల్యేతో చర్చించిన తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించారు. ఈ విషయమై పట్టణ అధ్యక్షుడు మెరుగు కార్తీక్ యాదవ్ మాట్లాడుతూ.. యూత్ తొందర పడకుండా సుదీర్ఘంగా చర్చించిన తర్వాత ఒక నిర్ణయం తీసుకుందామని, అంతవరకు అందరూ నిగ్రహంగా ఉండాలని కోరారు. సమావేశంలో మెరుగు కార్తీక్ యాదవ్, సతీష్, వెంకటేష్, శ్రావణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాంకేతిక రంగాన్ని అందిపుచ్చుకోవాలి

ఇల్లెందు: విద్యార్థులు గురువులు అందించే శాస్త్ర సాంకేతిక రంగాలను అందిపుచ్చుకుని అభివృద్ధి సాధించాలని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్ సూచించారు. శనివారం పట్టణంలోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నేషనల్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాట్లాడుతూ.. మౌలానా విద్యాభివృద్ధి కోసం కృషి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హుస్సేన్, కొండల్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అందరివాడిని.. ఆదరించండి: వనమా


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వనమా

చుంచుపల్లి: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న నేను అందరివాడిని.. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం చుంచుపల్లి మండలం పెనుబల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ పాలన దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని, ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజా ఆదరణ చూరగొన్నాయన్నారు. నియోజకవర్గానికి తాను చేసిన అభివృద్ధే వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వర్షాకాలంలో గోధుమ వాగు వల్ల పెనుబల్లికి రాకపోకల అంతరాయం కలుగుతుండేదని ఇప్పుడు కొత్త బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్నందున ఆ సమస్యను తీరబోతోందన్నారు. చివరిసారిగా ఎన్నికల బరిలో నిలిచిన తనను విజేతగా నిలబెట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కంచర్ల చంద్రశేఖరరావు, ఎంపీపీ శాంతి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్ ఓసీ ప్రభావిత ప్రాంత పీవీ నరసింహారావు సెంటినరీ కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని (ఏబీకేఎంఎస్ బీఎంఎస్) జాతీయ కార్యదర్శి పి.మాధవ నాయక్, ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి ఏరియా జనరల్ మేనేజర్ శాలెంరాజుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి మాట్లాడుతూ.. ఏరియాలోని జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలకు చెందిన కార్మికులు నివాసముంటున్న ఈ కాలనీకి వచ్చే మంచినీరు తాగడానికి ఉపయోగపడవని కనీసం స్నానం చేయటానికి కూడా పనికి రావన్నారు. కీళ్ల నొప్పులు, తల స్నానం చేస్తే, జుట్టు రాలిపోవటం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వారికి మున్సిపాలిటీ నీరు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సెప్టిక్‌ట్యాంకులు క్వార్టర్లకు సమీపంలోనే నిర్మించటం వలన దుర్వాసన వస్తున్నాయని చెప్పారు. కాలనీలలో రోడ్ల నిర్మాణం పనులు ఇంకా పూర్తికాకపోవడంతో దుమ్ము, ధూళి ఇళ్లలోకి వస్తోందన్నారు. సానుకూలంగా స్పందించిన జీఎం సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు నిర్మాణానికి హామీ ఇస్తేనే ఓట్లేస్తాం..


ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన రైతులు

జూలూరుపాడు: అన్నారుపాడు నుంచి పంట పొలాలకు వెళ్లే డొంక దారి నిర్మిస్తామని హామీ ఇచ్చిన వారికే ఓటు వేస్తామంటూ రైతులు విన్నూతంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులకు రైతులు ఈ ఫ్లెక్సీ ద్వారా ప్రశ్నిస్తున్నట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పంట పొలాలకు వెళ్లాలంటే దశాబ్దాలుగా మంగళగిరి డొంక గోసగా మారిందన్నారు. గ్రామం నుంచి పొలాల వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర ఉన్న డొంక దారి ఉంది. సుమారు 2 వేల ఎకరాలు వ్యవసాయ భూములు ఉండటంతో రైతులు నిత్యం ఈ దారి ఉపయోగించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారు. వర్షాకాలంలో మోకాళ్ల లోతు బురదతో మరింత ఇబ్బంది పడుతున్నారు. అన్నారుపాడు, బచ్చలకోయగూడెం, పాపకొల్లు రైతులు సైతం ఈ దారిని ఉపయోగించుకుంటారని తెలిపారు.

రాజకీయం వ్యాపారమయింది..


మాట్లాడుతున్న రంగారావు

పాల్వంచ: కొందరు నేతలకు రాజకీయాలు బిజినెస్‌లా మారిపోయాయని, పార్టీని వీడిన నాయకుల వల్ల కాంగ్రెస్‌కు ఎలాంటి నష్టం లేదని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఎస్ఏ.జలీల్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. పొత్తులో భాగంగా సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకు టికెట్ కేటాయించిన కాంగ్రెస్ అధిష్ఠాన నిర్ణయాన్ని గౌరవిస్తున్నామన్నారు.

టికెట్ రానివారు వేరే దారి చూసుకున్నారని వారి వల్ల పార్టీకి ఎటువంటి నష్టం లేదని, వారి వెంట ఒక్క కార్యకర్త కూడా వెళ్లడం లేదని, వారి ఒక్క ఓటు వల్ల మా మెజారిటీ ఒకటి మాత్రమే తగ్గుతుందన్నారు. పార్టీ నిర్ణయానికి భవిష్యత్‌లో కట్టుబడి పనిచేస్తామని, కూనంనేని గెలుపు కోసం తమవంతు ప్రచారం చేసి గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో కొండం వెంకన్నగౌడ్, గద్దల రమేశ్, నరసింహారావు, చాంద్‌పాషా, వసంతరావు, సూర్యకిరణ్, చాప రాము, చంద్రగిరి సత్యనారాయణ, బీఎస్.చారి, బత్తుల వెంకటేశ్వర్లు, వానపాకుల రాంబాబు, శ్రీరాములు, సాంబయ్య, బండి సత్యనారాయణ, ఎస్‌కె.ఖాజామియా పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలి


ప్రచారం చేస్తున్న కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెంరూరల్: మండలంలోని రేగళ్ల, మైలారం, బంగారు చెలక, గట్టుమళ్ల పరిసర ఏజెన్సీ గ్రామాల్లో కొత్తగూడెం నియోజకవర్గ సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావు, సీపీఐ, కాంగ్రెస్, సీపీఎం, టీజేఎస్ శ్రేణులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఏజెన్సీలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేస్తూ కూనంనేని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతూ కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలన సాగించారని, కేసీఆర్ మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చగలిగే సత్తా వున్న కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు, కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకునేందుకు కంకికొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎస్‌కే సాబీర్‌పాషా, తూము చౌదరి, పూనెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాల్వంచ: రాష్ట్రంలో బీఆర్ఎస్, దేశంలో బీజేపీని గద్దె దింపి రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకునేందుకు ప్రజలు సిద్ధం కావాలని కాంగ్రెస్, సీపీఎం, టీజేఎస్ బలపర్చిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం మామిళ్లగూడెం, రేగులగూడెం, చంద్రాలగూడెం, తుమ్మలగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గొల్లపల్లి దయానంద్, తూము చౌదరి, చంద్రగిరి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిని చట్టసభల్లోకి పంపించండి

జూలూరుపాడు: ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను చట్టసభల్లోకి పంపించాలని సీపీఎం వైరా ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా వీరభద్రం అన్నారు. శనివారం ఆయన పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాచినేనిపేట తండా, పడమటనర్సాపురం, పాపకొల్లు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం పేదలు, రైతులు, కూలీలు, కార్మికుల సమస్యలపై పోరాడే పార్టీ అన్నారు. సుత్తికొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో యాసా నరేష్, లకావత్ శ్రీను, ఊడల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం ఎన్నిక


ప్రకాష్‌కు నియామకపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఇల్లెందురూరల్: ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి మండలాల ఫొటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వరుసగా ఐదోసారి మారుతి ప్రకాష్ ఎన్నికయ్యారు. మండలంలోని సుభాష్ నగర్‌లో ఫొటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ మూడు మండలాల వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలను సంఘం జిల్లా ప్రతినిధుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించిన ఎన్నికలో ప్రకాశ్ 29 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. సంఘం జిల్లా ప్రతినిధులు ప్రకాశ్‌కు ఎన్నిక పత్రాన్ని అందజేశారు. అధ్యక్షుడిగా మారుతి ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల వెంకటరమణారావు, కోశాధికారిగా యాసారపు సతీష్ ప్రమాణ స్వీకారం చేశారు. వేముల నర్సింహారావు, కీసర సుధాకర్ రెడ్డి, వనచర్ల రామకృష్ణ, బెల్లం అనిల్, పంపన రమేష్, వెంకటేశ్వర్లు, పుట్టా రాంమ్మూర్తి, గౌరవ అధ్యక్షుడు వైవీ రెడ్డి, బీఆర్ మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఇల్లెందు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఆదివారం ఇల్లెందులోని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఘనంగా జరుపుకున్నారు. కొత్తబస్టాండ్ సెంటర్, జగదాంబ సెంటర్ల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. సుల్తాన్, జగదీష్, శ్రీనివాస్, రాజు, సదా, మోహన్ పాల్గొన్నారు.